క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

● ఏపీఐఐసీ చైర్మన్ జంకె



కొట్టాలపల్లిలో మాట్లాడుతున్న జంకె

మార్కాపురం రూరల్: మార్కాపురం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న అన్నా రాంబాబు, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి మండలంలోని కొట్టాలపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని, ఫ్యాను గుర్తుపై ఓటువేయాలని కోరాలని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి గెలుపునకు కృషి చేయాలని జంకె కోరారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, జంకె వెంకట నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మాలకొండయ్య, ఎంపీటీసీ వీరయ్య, పంబి వెంకటరెడ్డి, గౌస్ మొహిద్దీన్, చదలవాడ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా యూత్ రీట్రీట్



క్రీస్తు గీతాలను ఆలపిస్తున్న హర్షిత, డాక్టర్ లీనాగ్రేస్

మార్కాపురం: పట్టణంలోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో బుధవారం యూత్ రిట్రీట్ కార్యక్రమాన్ని డైరెక్టర్ డాక్టర్ లీనాగ్రేస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జాన్‌పాల్ హాజరై వాక్య సందేశం అందించారు. యవ్వనస్తులు దేవునియందు భయభక్తులు కలిగి ఉండాలని, తోటివారి పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలన్నారు. వీలైనంత వరకూ పక్క వారికి సాయం చేసే గుణం అలవర్చుకోవాలని అన్నారు. ఏసుబోధనలు ఆచరిస్తే ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉంటారన్నారు. ప్రెసిడెంట్ జయపాల్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దారివేముల హర్షిత పాల్గొన్నారు. అనంతరం క్రీస్తు గీతాలు ఆలపించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్వో లోకేశ్వరరావు

దర్శి: నేటి నుంచి 25వ తేదీ వరకు నామినేషన్‌లు వేస్తున్న సందర్భంగా నామినేషన్‌లు వేసేవారు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆర్వో లోకేశ్వరరావు సూచించారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో అన్నీ రాజకీయ పార్టీల ప్రధాన నేతలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ ఒక వ్యక్తి పేరున నాలుగు నామినేషన్‌లు వరకు వేసుకోవచ్చని తెలిపారు. రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ డిపాజిట్‌పై ఎక్కడైనా నామినేషన్ వేసుకునే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం డిపాజిట్‌లో రాయితీ ఉందన్నారు. విత్‌డ్రా చేసుకున్న అభ్యర్థులకు ఎన్నికలు పూర్తి అయిన తర్వాత డిపాజిట్ సొమ్ము ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. స్క్రూట్నీలో నామినేషన్ రద్దు అయితే ఆ డిపాజిట్ ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థికి 10 మంది సాక్షులు కావాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ వేసే వ్యక్తితో పాటు ఐదుగురు మాత్రమే లోనికి అనుమతి ఉంటుందని చెప్పారు. తహసీల్దార్ సుజాత, కమిషనర్ మహేష్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో వసంత నవరాత్రులు



పూజలు చేస్తున్న భక్తులు

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న శిరిడీ సాయిబాబా మందిరంలోని చంద్రమౌళీశ్వర దేవాలయంలో జగన్మాత ఉగాది వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహన్యాస పూర్వక, ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామార్చనలు, ఛండీ హోమం నిర్వహించారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా సాయిబాబాకు పంచామృతాభిషేకం, సీతారామకల్యాణం నిర్వహించి చందనోత్సవం చేశారు. బాబా చిత్రపటాన్ని గుర్రంపై ఊరేగించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. మందిరం అధ్యక్ష, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, రిటైర్డు ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, యువసేవా సమాజ్ సభ్యులు గోపాలుని కృష్ణమోహన్, కరీంబాషా, పిచ్చిరావు, కిశోర్, విజయ్, గోపి, నాగేశ్వరరావు, మధు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు



వై.పాలెంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్



రామాలయంలో పూజలు చేస్తున్న అన్నా కృష్ణచైతన్య



కురిచేడు: పొట్లపాడులో కళ్యాణానికి సిద్ధమైన సీతారాములు

యర్రగొండపాలెం: శ్రీరామనవమి వేడుకలను యర్రగొండపాలెం నియోజకవర్గంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యర్రగొండపాలెంలోని కొలుకుల రోడ్డులో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంగరంగ వైభవంగా పండుగ జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ సీతారాముల చిత్రపటాలకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175 సీట్లలో విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆయన కోరుకున్నారు. పూజల్లో పాల్గొన్న వారికి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు సూరె రమేష్, పబ్బిశెట్టి శ్రీనివాస్, కందూరి గురుప్రసాద్, కందూరి కాశీవిశ్వనాథ్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, సర్పంచ్ అరుణాబాయి పాల్గొన్నారు.

పలు మండలాల్లో...

వై.పాలెం నియోజకవర్గంలోని పెద్దదోర్నాల, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోనూ భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

కొనకనమిట్ల: శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాలు బుధవారం వాడవాడలా కనుల పండువగా నిర్వహించారు. గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల, చినారికట్ల, వాగుమడుగు, సలనూతల, నాగంపల్లి, బ్రాహ్మణపల్లి, నాయుడుపేట గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణం భక్తుల జయజయధ్వానాలతో కమనీయంగా సాగింది. గ్రామాల్లో అలంకరించిన పూల పందిళ్లలో సీతారాములకు వేదపండితులు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలతో కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు.

గొట్లగట్టులో ముత్యాల తలంబ్రాలు

మండలంలోని గొట్లగట్టు రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వినుపాముల రామకృష్ణశర్మ ఆగమశాస్త్ర విధి విధానాలతో, మంత్రోచ్ఛరణ వ్యాఖ్యలతో, రామతారక మంత్ర ప్రాశస్త్యం గురించి తెలిపి స్వామి వారి కల్యాణం జరిపారు. స్వామి వారికి గ్రామ పెద్దలు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీతారాములకు పలు రకాల పూలతో పుష్పాభిషేకం జరిపించారు. ముందుగా సీతారాముల కల్యాణానికి అవసరమైన పట్టు వస్త్రాలు, పెళ్లి పీటలను మేళతాళాలతో తీసుకెళ్లి స్వామి వారికి బహూకరించారు.

బారులు తీరిన పానకం బండ్లు

గొట్లగట్టులో స్వామివారి కల్యాణం అనంతరం రైతులు పానకం బండ్లు కట్టి ఊరేగింపు నిర్వహించారు. వడపప్పు, పానకంలను భక్తులకు పంచిపెట్టారు. పానకం బండ్లపై సీతారాముల బ్యానర్లను ఏర్పాటు చేసి కొబ్బరి తోరణాలు, రంగు రంగుల బెలూన్లతో అందంగా బండ్లు అలంకరించగా మహిళలు వడపప్పు, పానకం తీసుకెళ్లి రాములోరికి సమర్పించారు.

కురిచేడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు భక్తులు సీతారాముల కళ్యాణాన్ని తిలకించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కురిచేడులోని శ్రీ కోదండరామాలయంలో, పొట్లపాడులోని శ్రీ కోదండరామాలయంలో సీతారాముల కళ్యాణం ప్రత్యేకతను సంతరించుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

కొమరోలు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు రామాలయాల్లో వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయాల్లో బుధవారం తెల్లవారు జాము నుంచి సీతారాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల కళ్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు రామాలయాల్లో అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి పూజలు చేశారు. దేవాలయాల్లో పానకం, వడపప్పు, ప్రసాదాన్ని భక్తులకు స్వీకరించారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

మార్కాపురం: శ్రీరామనవమి పర్వదినాన్ని బుధవారం భక్తులు వైభవంగా జరుపుకున్నారు. వాడవాడలా సీతరాముల కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి కన్నులారా తిలకించారు. మండలంలోని బొడిచెర్ల, బోడపాడు వివిధ గ్రామాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. నాగులపుట్ట వీరాంజనేయస్వామి, మెయిన్ బజార్‌లోని సీతరామచంద్రస్వామి, పట్టాభిరామ స్వామి, మార్కెట్ సెంటర్‌లోని రామాలయం, రజక వీధిలోని రామాలయాల్లో నవమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు.

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, సీతారామస్వామి ఆలయం, పట్టాభిరామస్వామి ఆలయం, శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం, అభయాంజనేయస్వామి, రాచర్ల గేటు సెంటర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి, కొత్తపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయం, పాదలకుంటపల్లె గ్రామంలో రామాలయంతో పాటు మండలంలోని అన్ని రామాలయాల్లో శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో కమిటీ నిర్వాహకులు భక్తులకు పానకం వడపప్పు పంపిణీ చేశారు. పాదలకుంటపల్లెలో రామాలయంలో స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారామస్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీరామదండు శోభాయాత్ర

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ ఆలయం కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సీతారామస్వామి ఆలయం నుంచి వైఎస్సార్ విగ్రహం మీదుగా బుధవారం ప్రధాన వీధుల్లో శ్రీరామదండు శోభా యాత్రను భక్తులు బైక్‌లపై నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి ఎర్రారెడ్డి మాట్లాడుతూ శ్రీరామనవమి పండగను ప్రతి హిందువు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీరాముడి జీవితం యావత్తు మానవాళికి ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. నిర్వాహలు సూరే కృష్టారావు, బూజుమేకల రాజు పాల్గొన్నారు.



పుల్లలచెరువులో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న పండితులు



త్రిపురాంతకంలో శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తున్న రామభక్తులు



త్రిపురాంతకంలో సీతారామస్వామి కళ్యాణ మహోత్సవం



గిద్దలూరు: పానకం పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ



కొమరోలు : సీతారాముల కళ్యాణం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు



గొట్లగట్టులో సీతారాముల కళ్యాణ వేడుక



పెద్దదోర్నాలలో స్వామివార్ల మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

దర్శి నియోజకవర్గంపై బూచేపల్లి ముద్ర

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయనున్నారు.. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి 2004 ఎన్నికల్లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సూచనలు మేరకు 2009 ఎన్నికల్లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. సంవత్సరం ముందుగానే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నడిచారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైనా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉన్నారు. ఆ తర్వాత తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి అనారోగ్య కారణంతో 2019 ఎన్నికల్లో పోటీ చేయకుండా వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను 39 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచేందుకు ఎన్నికల్లో తిరిగారు. దర్శితో పాటు సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన టీజేఆర్ సుధాకర్‌బాబును కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించారు. వైఎస్సార్ సీపీ కేడర్‌ను కాపాడుకుంటూ కార్యకర్తలకు అండగా ఉంటూ వచ్చారు. దర్శి జెడ్పీటీసీగా శివప్రసాదరెడ్డి తల్లి బూచేపల్లి వెంకాయమ్మను ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూచేపల్లి కుటుంబం పార్టీకి చేసిన సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బూచేపల్లి వెంకాయమ్మను జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత జిల్లాతో పాటు దర్శి, సంతనూతలపాడు రెండు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులకు అండగా ఉంటూ వారి అవసరాలు తీరుస్తూ వారి అభిమానం పొందుతున్నారు. ఈ తరుణంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని దర్శి నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడం పై వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు బూచేపల్లి అభిమానులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నలుమూలల నుంచి ఎక్కడ ఏం జరిగినా బూచేపల్లి కుటుంబం సహాయ సహకారాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వైఎస్సార్ సీపీతో పాటు ఇతర పార్టీలకు చెందిన నాయకులు ఆశ్రయించినా బేదాభిప్రాయాలు చూడకుండా బూచేపల్లి కుటుంబం అందరికీ సాయం చేస్తుందన్న పేరు సంపాదించుకుంది.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

●సబ్ కలెక్టర్ రాహుల్ మీనా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, డీఎస్పీ

మార్కాపురం టౌన్: వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 18న గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎస్పీ బాలసుందరరావు, రెవెన్యూ, పోలీసు అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 100 మీటర్ల పరిధిలో పాటించాల్సిన నిబంధనలపై సిబ్బందికి సూచనలిచ్చారు. సబ్ కలెక్టర్ కార్యాలయం బయట భారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. నామినేషన్లు దాఖలు పరిచేందుకు అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోనికి అనుమతిస్తారు. ఈ నెల 18 నుంచి 25 వరకూ నామినేషన్లు దాఖలు చేస్తారు. 26న నామినేషన్‌ల పరిశీలన జరుగుతుంది. 29 సాయంత్రం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.

నేడు మన ఊరికి మన చంద్రశేఖరన్న

పెద్దదోర్నాల: మండల పరిధిలోని రామచంద్రకోట, జమ్మిదోర్నాల, కడపరాజుపల్లె, హసనాబాద్ గ్రామాల్లో గురువారం మన ఊరికి మన చంద్రశేఖరన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు రామచంద్రకోట, 11 గంటలకు కడపరాజుపల్లె, మధ్యాహ్నం 3 గంటలకు జమ్మిదోర్నాల, సాయంత్రం 5 గంటలకు హసనాబాద గ్రామాల్లో నిర్వహించే ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం అసెంబ్లీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రత్యేక బలగాల ప్రదర్శన

దర్శి: స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో ప్రత్యేక బలగాల ప్రదర్శన బుధవారం ఆకట్టుకుంది. ఎన్నికల సందర్భంగా వారు చేసిన విన్యాసాలు అబ్బుర పరిచాయి. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరుగుతాయని చెప్పడానికి ఈ ప్రదర్శనలు చేశారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ షమీఉల్లా, ఎస్సై సుమన్ పాల్గొన్నారు.

నామినేషన్‌ల ప్రక్రియ ప్రశాంతంగా జరగాలి: ఎస్పీ

దర్శి: దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్‌ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశించారు. దర్శిలో ఈవీఎంలు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించి రెవెన్యూ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీస్ వద్ద నామినేషన్‌లకు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. తాళ్లూరు పీఎస్ పరిధిలో ప్రజలకు ఎన్నికల నియమావళి, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆర్వో కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు. గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ సమీఉల్లా, ఎస్సైలు ఆర్.సుమన్, రమణయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

251 కేసుల మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం కేసులను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

ముండ్లమూరు: మండలంలోని లక్ష్మీనగర్, ముండ్లమూరు, నాయుడుపాలెంలో బుధవారం అనధికారికంగా నిల్వ చేసిన 251 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నట్లు దర్శి ఎస్‌ఈబీ సీఐ సుందరరామయ్య తెలిపారు. ఎస్‌ఈబీ అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముండ్లమూరు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కారులోకి ఎక్కిస్తున్న 20 మద్యం కేసులు, నాయుడుపాలెంలో 10 మద్యం కేసులు, లక్ష్మీనగర్‌లో ఓ ఇంట్లో దాచిన 221 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేసుల్లో ముండ్లమూరు మద్యం షాపులో పని చేస్తున్న షేక్ అంజిబాబు, యాదాల శ్రీనివాసరావు, పోలవరపు ఖాశింవలి, లక్ష్మీనగర్‌లో మద్యం నిల్వ చేసిన ఇంటి యజమాని పేరంరెడ్డి మాలకొండారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే పేద ప్రజలకు న్యాయం



జెడ్పీటీసీ ఇందిరతో కేక్ కట్ చేయిస్తున్న అన్నా కృష్ణచైతన్య

తర్లుపాడు: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు తనయుడు కృష్ణచైతన్య స్పష్టం చేశారు. బుధవారం రాత్రి మండలంలోని పోతలపాడు ఎస్సీ కాలనీ, కందళ్లపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందచేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా అన్నా రాంబాబును, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి పాలనను గ్రామస్థాయిలోనే అందిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సేవలను ప్రజలు గుర్తెరిగి ఆ పార్టీకి పట్టం కట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు

జెడ్పీటీసీ వెన్నా ఇందిర హనుమారెడ్డి జన్మదిన వేడుకలను సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి అన్నా కృష్ణచైతన్య ఘనంగా నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కందళ్లపల్లిలో జెడ్పీటీసీకి పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు జన్మదినం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు చెన్నకేశవులు, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, సర్పంచ్‌లు గంటా వెంకటరెడ్డి, కాశయ్య, రమణారెడ్డి, గుమ్మ రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకులు ప్రమీలారెడ్డి, మహేష్, వెంకటేశ్వరరెడ్డి, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, డి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం అభివృద్ధి అన్నా బాధ్యత



మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న అన్నా దుర్గాకుమారి

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత అన్నా రాంబాబు తీసుకుంటారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు సతీమణి అన్నా దుర్గాకుమారి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె పట్టణంలోని వివిధ వార్డుల్లో బుధవారం పార్టీ నేతలతో కలిసి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ జెండాతోనే ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం వస్తుందని, వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4 సంవత్సరాల 10 నెలల కాలంలో కుల,మత, రాజకీయ బేధం లేకుండా ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర, జగనన్న తోడు, సున్నా వడ్డీ, ఆసరా, చేయూత, జగనన్న గోరుముద్ద, పథకాలను అందించారన్నారు. చిర్లంచర్ల లీలావతి, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, రోజ్‌లిడియా, గుంటక వనజాక్షి, దారివేముల హర్షిత, దొడ్డ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.